క్లుప్తంగా

నేత్రపర్వం.. చాముండేశ్వరిదేవి కల్యాణం

• వీక్షించి పులకించిన భక్తులు



అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఇందుకూరుపేట: వేదపండితుల మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాల నడుమ చాముండేశ్వరిదేవి సమేత త్రిశూలేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టం కల్యాణోత్సవాన్ని బుధవారం వేకువజామున శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తుల కేరింతల నడుమ గ్రామం నుంచి ఆలయానికి తీసుకొచ్చారు. మండపంలో కొలువుదీర్చి సంప్రదాయబద్ధంగా కల్యాణ వేడుకను జరిపారు. దేవదేవేరుల కల్యాణాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వేడుక బుధవారం ఉదయం వరకు సాగింది. అనంతరం అమ్మవారికి పూలంగి సేవ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు క్యూ కట్టారు. పూలంగి సేవకు ఉభయకర్తలుగా ప్రవాస భారతీయులు పిల్లారిశెట్టి వెంకటనాగ సందీప్– సింధూర దంపతులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్‌కుమార్‌శర్మ, మాచవోలు రామకృష్ణ, ముప్పిరాల కిశోర్, యాజ్ఞికులు మున్నూరు మల్లికార్జున గురుకుల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రాత్రి ఆలయ ఆవరణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వేడుకగా వసంతోత్సవం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వసంతోత్సవం వేడుకగా సాగింది. అనంతరం త్రిశూలేశ్వరస్వామి ఉత్సవం, గంగోత్సవం జరిగింది. గంగోత్సవానికి ఉభయకర్తలుగా స్థానిక యాదవులు వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన రథోత్సవం(సిరిమాను) గురువారం రాత్రి జరుగనుంది. ఈ సందర్భంగా అగ్నిగుండం, ధ్వజావరోహణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తొలుత ఉదయం తీర్థవాది సముద్రస్నానం పూజలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



మనుబోలు: మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

మనుబోలు: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని హైదరాబాద్‌కు చెందిన భారత వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మనుబోలు రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయంలో ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి వివరించారు. ఆగ్రో జియో ఇన్ఫర్మేటిక్స్ వ్యవస్థ అవసరం గురించి వివరించి, ఎలా తయారు చేసుకోవచ్చనే విషయాన్ని తెలియజేశారు. గ్రామీణ స్థాయిలో డిజిటల్ మ్యాప్స్ ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూసారం పెంచుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ వరిసాగులో నూతన వంగడాలు, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. మత్స్య శాస్త్రవేత్త హరిసాధు చేపల పెంపకంపై అవగాహన కల్పించారు.

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి గ్రామంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించారు. నారుమడుల యాజమాన్యం, రసాయన ఎరువుల వాడకం, భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లోకేష్ అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి

మనుబోలు: ప్రభుత్వ లేఅవుట్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను అదనపు నగదుతో జూన్ 22లోపు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి లబ్ధిదారులకు సూచించారు. ఆమె తన కార్యాలయంలో బుధవారం హౌసింగ్ ఏఈ శరత్‌బాబు, సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జట్లకొండూరు గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జూన్ 22 నాటికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలని అధికారులకు సూచించారు.

వేడుకగా వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రారంభించారు. నవకలశ స్నపన తిరుమంజనం, విశేష పుష్పాలంకారం, దివ్యప్రబంధగోష్ఠి, ఆస్థాన సేవ, శాత్తుమొరైను విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా దివి సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా లక్షమల్లెలార్చన



నెల్లూరు(బృందావనం): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జ్యేష్టాభిషేకం, శాంతిహోమాన్ని భక్తిప్రపత్తులతో బుధవారం నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన సీతారామ, లక్ష్మణ, హనుమంతుడు, శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి సామూహిక లక్షమల్లెలార్చనను జరిపారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని బుధవారం నిర్వహించారు. కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా వేల్పూరి నాగశంకర్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషా కుమారి దంపతులు పర్యవేక్షించారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): నగరంలో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టనున్నామని ఎంహెచ్ఓ చైతన్య పేర్కొన్నారు. 14వ డివిజన్లోని కేఫ్ సెంటర్ నుంచి చేపట్టిన పారిశుధ్య పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. కొంత మంది పారిశుధ్య కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని సూచించారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని శాంతి ఓల్డేజ్ హోమ్‌కు నిత్యావసర సామగ్రిని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ షో యువర్ లవ్ అగాపే సౌజన్యంతో బుధవారం అందజేశారు. రెవరెండ్ డాక్టర్ మణిరావు, కృపారాజన్, అంకయ్య, పెంచలయ్య, మేరీ సరళ, మేరీ బ్లెస్సింగ్టన్, ప్రభావతి, ఆశ్రమ నిర్వాహకులు క్రిస్టీప్రియ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం గ్రేడ్ – 2లకు ఉద్యోగోన్నతులివ్వాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో జేఎల్‌ఎం గ్రేడ్ – 2 ఎనర్జీ అసిస్టెంట్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ఉద్యోగోన్నతులివ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జేఎల్‌ఎంలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జేఎల్‌ఎం గ్రేడ్ – 2 హక్కుల సాధనకు గానూ గుంటూరులో ఈ నెల 22న నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ శివయ్య, రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్, నేతలు ప్రసన్నకుమార్‌రెడ్డి, విజయరామిరెడ్డి, గిరిబాబు, నాగయ్య, సునీల్, చైతన్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాన్ని కల్పించాలని వినతి

నెల్లూరు సిటీ: తమ ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని పలువురు బుధవారం కోరారు. డయల్ యువర్ డీఎం – 2 కార్యక్రమంలో భాగంగా డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్‌కు సమస్యలను ముగ్గురు తెలియజేశారు. వెంకటాచలం సమీపంలో గల అడవిలోని శివాలయం వద్ద రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని బుజబుజనెల్లూరుకు చెందిన శేఖరయ్య.. మైపాడుకు తెల్లవారుజామున మూడు గంటలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని వరప్రసాద్.. జనార్దన్‌రెడ్డి కాలనీ నుంచి బుజబుజనెల్లూరుకు బస్సును ఏర్పాటు చేయాలని ఆనంద్ కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని మేనేజర్ హామీ ఇచ్చారు.

డయల్ యువర్ డీఎం – 1 నేడు

డయల్ యువర్ డీఎం – 1 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నామని మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. 99592 25641 నంబర్‌కు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు ఫోన్ చేసి సూచనలను తెలియజేయాలని కోరారు.

ప్రణాళికబద్ధంగా రొట్టెల పండగ నిర్వహణ

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. రొట్టెల పండగ నిర్వహణపై కార్పొరేషన్ కార్యాలయంలోని కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సమావేశాన్ని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జూలై ఆరు నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమానికి ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని కోరారు. మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఎంహెచ్ఓ చైతన్య, ఆర్డీఓ అనూష, డీఎస్పీ సింధుప్రియ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

22న నాయీబ్రాహ్మణ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి సంఘ సర్వసభ్య సమావేశాన్ని నవాబుపేటలోని మద్దులూరి వీరరాఘవయ్య కల్యాణ మండపంలో ఈ నెల 22న నిర్వహించనున్నామని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరుకావాలని, వివరాలకు 99633 24585 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

15న డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు

నెల్లూరు(అర్బన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శేషారెడ్డి స్మారక సదస్సును ఆదివారం నిర్వహించనున్నామని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య విద్య ప్రైవేటీకరణ – పర్యవసానాలు అనే అంశంపై సదస్సును నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

యోగాపై పాటల పోటీలు రేపు

నెల్లూరు రూరల్: యోగాంధ్రను పురస్కరించుకొని యోగాపై పాటల పోటీలను నగరంలో శుక్రవారం నిర్వహించనున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 9.30కు ప్రారంభంకానున్న పోటీలకు ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు. గెలుపొందిన వారు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని, అక్కడ గెలుపొందిన వారికి రూ.లక్ష నగదు బహుమతిని అందజేయనున్నారని వెల్లడించారు.

ఆర్టీఓ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నెల్లూరు ప్రాంతీయ రవాణాధికారిగా మదానీ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. అనంతరం ఉప రవాణా కమిషనర్ చందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 16వ డివిజన్లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను బుధవారం నిర్వహించారు. వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, సాయిరామ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీఓ గుర్రప్పను కావలి డివిజనల్ సహకార శాఖ అధికారి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో భేటీ అయి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మనుబోలు: పీఎం సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో పొదలకూరు డివిజన్ ఏడీ సుబ్రహ్మణ్యం అన్నారు. మనుబోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రాయితీ ఇస్తోందని తెలిపారు. దీనిద్వారా వినియోగదారులకు ప్రతినెలా కరెంటు బిల్లుల భారం తగ్గుతుందన్నారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకులు రుణం కూడా ఇస్తాయన్నారు. ఈ పథకం లబ్ధిదారులు బీసీలైతే రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు అదనంగా రాయితీ ఇస్తుందన్నారు. ఆయన వెంట లైన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఉన్నారు.

మార్కెట్ ప్రాంగణంలో శుభ్రత పాటించాలి



మార్కెట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. మార్కెట్ ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం అక్కడ చేపట్టిన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి దుకాణంలో చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకొని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయడాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. అనంతరం గుండ్లపాళెంలోని లేఅవుట్‌ను సందర్శించారు.

- నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో కాలువల పూడికతీతతో పాటు సిల్ట్ తొలగింపు పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కోరారు. ఎంహెచ్ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, మలేరియా విభాగాధికారి జిజియాబాయి, సూపరింటెండెంట్ సులోచన తదితరులు పాల్గొన్నారు.
- యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఆరుగుర్ని విజేతలుగా ఎంపిక చేశామని, త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. వివిధ స్థాయిల్లో విజేతలుగా నిలిచిన పలువురికి జిల్లా స్థాయి యోగా పోటీలను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, డీఎస్డీఓ యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా యోగా డే

నెల్లూరు(అర్బన్): ఒత్తిడి లేని ఆరోగ్యవంతమైన దేశం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ నేపథ్యంలో నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాలీని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్, ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో పాటు డాక్టర్లు యోగా చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడారు. యోగా చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ, నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఏపీ టూరిజం అధికారి ఉషశ్రీ, ఎన్‌ఐసీ జిల్లా అధికారి సురేష్‌బాబు, ఎల్డీఎం మణిశేఖర్, జిల్లా యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి, పతంజలి ఇన్‌చార్జి విజయకుమార్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, డాక్టర్ శివరాములు, యోగా ట్రైనర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



అట్రాసిటీ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మహిళపై దౌర్జన్యం చేయడమే కాకుండా ఆమెను కులంపేరుతో దూషించిన ఘటనలో నిందితులపై అట్రాసిటీ కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విరాట్‌నగర్‌లో నివాసం ఉంటున్న విజయకు పసుపు, కుంకుమ కింద వీబీఎస్ కల్యాణ మండప సమీపంలో ఓ స్థలాన్ని తల్లిదండ్రులిచ్చారు. ఆ స్థలంలో ఉన్న ఇంటిని పగలగొట్టి నూతనంగా గృహాన్ని నిర్మించాలని ఆమె నిర్ణయించారు. ఈ క్రమంలో సదరు స్థలంలో గోడ కట్టేందుకు ఇంటి పక్కనే ఉంటున్న జిలానీ, మరికొందరు గత నెల 23న యత్నిస్తుండగా ఆమె అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు ఆమెను కులంపేరుతో దూషించడమే కాకుండా దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు కాజేసి..

నెల్లూరు(క్రైమ్): లోన్ ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాల నుంచి నగదును కాజేయడంతో పాటు అంతుచూస్తామని బెదిరించిన నిందితుడిపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సీతారామపురం మండలానికి చెందిన రాజుకు పొదలకూరు పద్మావతినగర్‌కు చెందిన శివకృష్ణారెడ్డితో పరిచయమైంది. బ్యాంక్‌లో లోన్ ఇప్పిస్తానని రాజును నమ్మించారు. అనంతరం అతనికి తెలియకుండానే ఓ బ్యాంక్ ఖాతా నుంచి రూ.ఐదు లక్షలు, మరో ఖాతా నుంచి రూ.4.2 లక్షలను కాజేశారు. ప్రశ్నించిన రాజును అంతుచూస్తామని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోలార్ విద్యుత్‌తో ఎన్నో ప్రయోజనాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోలార్ విద్యుత్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయని, దీనిపై వినియోగదారులు దృష్టి సారించాలని పీఎం సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సబ్ డివిజన్లో అధికారులు, సిబ్బంది, వినియోగదారులతో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని కోరారు. డీఈఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

